ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

సోమవారం 16, ఫిబ్రవరి 2026



# మారుమ్రోగిన శివనామస్మరణ..

**జైపూర్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

శివరాత్రిని పురస్కరించుకుని జైపూర్ మండలంలో ప్రసిద్ధ శైవ క్షేత్రమైన వేలాల గట్టు మల్లన్న జాతర ఆదివారం శివ నామ స్మరణతో మారు మ్రోగిపోయింది. వేలాల గట్టు మల్లికార్జున స్వామిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. మల్లన్న దర్శనానికి భక్తులు గంటల పాటు క్యూ లైన్‌లో వేచి ఉన్నారు. మూడు రోజుల పాటు జరిగే జాతర మొదటి రోజే సుమారు లక్షల మంది భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకున్నట్లు ఆలయ ఈవో రమేష్ తెలిపారు. ఉదయం నుండి గట్టుపైకి చేరుకున్న భక్తులు స్వామి వారిని దర్శించుకోవడంతో పాటు బోనాలు సమర్పించి,పట్నాలు చెల్లించుకున్నారు. భక్తులు మల్లన్న స్వామికి ప్రత్యేక పూజలతో పాటు ఒడి బియ్యం, కేశఖండనలతో మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం త్రాగు నీరును అందించారు. పలు స్వచ్ఛంద సంస్థల వారు భక్తులకు అరటిపండ్లు, సంత్రాలు, ప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తుల రక్షణ కొరకు ఏ.సి.పి ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

# కిటకిటలాడిన శైవక్షేత్రాలు



## భక్తి శ్రద్ధలతో భక్తుల అభిషేకాలు, ఉపవాసాలు

**ఆసిఫాబాద్, ప్రభాతవార్త**

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో మహా శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే పలు ప్రాంతాల్లో శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. తెల్లవారుజామునుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. శివుడికి రుద్రాభిషేకాలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక శోభ నెలకొంది. మహాశివరాత్రి సందర్భంగా పట్టణంలోని శ్రీ బాలేశ్వరా ఆలయంలో ఆసిఫాబాద్ మిగతా 2లో..



# మందమర్రిలో భారీ అగ్నిప్రమాదం

* సుమారు రూ.20 లక్షల ఆస్తి నష్టం * అగ్నిమాపక కేంద్రం ఎక్కడా..?
* ప్రజల్లో ఆగ్రహం.. * పండుగపూట విషాదం



**మందమర్రి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

పండుగ పూట మందమర్రి పట్టణంలో విషాదం చోటుచేసుకుంది. మందమర్రి పట్టణంలోని శ్రీపతి నగర్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా చెలరేగిన అగ్ని ప్రమాదంలో ఓ ఇల్లు పూర్తిగా దగ్ధమై, సుమారు రూ.20 లక్షల పైగా ఆస్తి నష్టం సంభవించింది. ఈ ఘటన పట్టణాన్ని కలవరపరిచింది. శ్రీపతి నగర్‌కు చెందిన తుమ్మ సదానందం అనే సింగరేణి ఉద్యోగి ఇంట్లో అగ్నిప్రమాదం జరిగింది. సదానందం రోజువారీగా తన విధులకు వెళ్లగా, ఇంట్లో అతని తల్లి ఇంటి వెనుక భాగంలో విశ్రాంతి తీసుకుంటుండగా, భార్య స్నానానికి వెళ్లింది. అదే సమయంలో ఇంటి నుంచి పొగలు వీధిలోకి వ్యాప్తి చెందడం గమనించిన స్థానికులు, వెంటనే అప్రమత్తమై ఫైర్ స్టేషన్‌కు, విద్యుత్ శాఖ వారికి సమాచారం అందించారు. అయితే ఫైర్ సిబ్బంది చేరుకునేలోపే మంటలు తీవ్రరూపం దాల్చి ఇల్లు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చినప్పటికీ, అప్పటికే ఇంటిలోని విలువైన సామాగ్రి పూర్తిగా కాలిపోయింది. నగలు, నగదు, టేకు ఫర్నిచర్, బెడ్‌లు, పరుపులు, టీవీ, సోఫా, టీపాయ్ తదితర సామగ్రి అన్నీ బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.20 లక్షలకుపైగా నష్టం సంభవించినట్లు ఇంటి యజమాని సదానందం తెలిపారు. అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరిగిపోయినప్పటికీ, జరిగిన ఆస్తి నష్టం ఆ కుటుంబాన్ని తీవ్రంగా కలిచివేసింది.పండుగ వేళ ఇలాంటి ఘటన జరగడంతో కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది. బాధిత కుటుంబీకుల రోదనలు మిగతా 2లో..

# శ్రీ శ్రీ శ్రీ సద్గురు సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో నడవాలి

**ఘనంగా శ్రీ శ్రీ శ్రీ సంత్ సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు**


**ఉట్నూర్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**



శ్రీ శ్రీ శ్రీ సద్గురు సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో ముందుకు నడవాలని మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ జనార్ధన్ రాథోడ్ అన్నారు.ఆదివారం మండలంలోని సేవాదాస్‌నగర్ జగ్నదంబ దేవి ఆలయంలో బంజారాల ఆరాధ్య దైవం శ్రీ శ్రీ శ్రీ సద్గురు సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆలయంలో భోగ్ బండారో చేసి ఆలయం నుండి సేవాలాల్ జండా జీసీసీ పెట్రోల్ బాంక్ వరకు పల్లికి శోభా యాత్ర నిర్వహించారు. ప్రజలు నృత్యాలు చేస్తూ శ్రీశ్రీశ్రీ సద్గురు సేవాలాల్ మహారాజ్ 287వ జయంతిని ఘనంగా నిర్వహించారు. అయన మాట్లాడుతూ... సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని అన్నారు. సేవాలాల్ మహారాజ్ క్రీ.శ 18 వ శతాబ్దం లో భారతదేశం మొత్తం సంచరిస్తూ ఆవులను మేపుకుంటూ సమస్త బంజారా ప్రజలకు జాగృతం చేశారు. తన జీవితాని త్యాగం చేసి, తన భోధనలను మాటలకే పరిమితం కాకుండా ప్రతిదీ ఆచరించి చూపించిన మిగతా 2లో..

# చెన్నూరు మున్సిపల్ చైర్మన్ పీఠంపై ఉత్కంఠ

- చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల కోసం పెరుగుతున్న ఆశావహుల సంఖ్య
- పదవులు కావాలంటూ బాహాటంగానే అనుచరులతో చెప్పిస్తున్న కౌన్సిలర్లు
- మున్సిపల్ చదరంగంలో మంత్రి చెక్ పెట్టేదెవరికి?
- ఎవరికి పట్టం కట్టాలో మంత్రి ముందుగానే నిర్ణయం తీసుకున్నారా!
- లోగుట్టు పెరుమాండ్ల కెరుక..



చెన్నూరు టౌన్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త

చెన్నూరు మున్సిపల్ పోరు ముగిశాక ఇక సింహాసనం అధీష్టించడమే తరువాయి అనుకున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీలో మరో కొత్త సమస్య తలెత్తింది. అదే చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు ఎవరికి ఇవ్వాలని. మంచిర్యాల జిల్లా చెన్నూరు మున్సిపాల్టీలో బల్దియా కుర్చీ కోసం సాగిన సమరంలో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగరేసింది. చెన్నూర్ మున్సిపాల్టీలో 18 వార్డులు ఉండగా, కాంగ్రెస్ 11 వార్డులలో విజయం సాధించి మ్యాజిక్ ఫిగర్‌ని దాటేసి చైర్మెన్ పదవి చేజిక్కించుకుంది. మిగిలిన వార్డుల్లో బీఆర్ఎస్ 4, బీజేపీ 2, ఇతరులు ఒక సీటు గెలిచిన విషయం విదితమే. ఇక గెలిచిన అభ్యర్థుల్లో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు మాకివ్వండి అంటే మాకివ్వండి అని కౌన్సిలర్లు పోటీలుపడి తమ అనుచరులతో బాహాటంగానే చెప్పిస్తున్నారు. పదవులు ఎవరికి ఇవ్వాలో పాలుపోక మంత్రి వివేక్ వెంకటస్వామికి మరో కొత్త సవాల్ ఎదురవుతున్నట్లు రాజకీయ విశ్లేషకులు అనుకుంటున్నారు. చెన్నూరు మున్సిపల్ చైర్మన్ బీసీ మహిళ కావడంతో గెలిచిన వారిలో ఎవరు విద్యావంతులు, ఎవరికి పట్టం కడితే మున్సిపాల్టీనీ అభివృద్ధి చేస్తారు అనే ఆలోచనలో మంత్రి ఉన్నట్లు పట్టణ ప్రజలు భావిస్తున్నారు. మరికొందరైతే చైర్మన్ పదవి ఎవరికి కట్టబెట్టాలో మంత్రి వివేక్ ఎప్పుడో నిర్ణయం తీసుకున్నారని అనుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీలో గెలిచిన 11 మంది కౌన్సిలర్ అభ్యర్థుల అభీష్టం మేరకు నిర్ణయం తీసుకుంటారా, తనని నమ్ముకుని తన వెంట నడిచిన వారికి పట్టం కడతారా, ఎవరికి చెక్ పెడతారు? ఎవరికి పట్టం కడతారో తెలియాల్సి ఉంది.

## కుంటాల సోమేశ్వర క్షేత్రంలో భక్తజన సందోహం

### శివనామస్మరణతో మారుమోగిన సహ్యాద్రి శ్రేణులు

నేరడిగొండ, ప్రభాతవార్త:



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదిలాబాద్ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కుంటాల సోమేశ్వర ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ప్రకృతి ఒడిలో, జలపాతాల చెంత వెలిసిన సోమేశ్వరుణ్ణి దర్శించుకోవడానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచే కాకుండా పక్క రాష్ట్రమైన మహారాష్ట్ర నుండి కూడా భక్తులు భారీగా తరలివచ్చారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు జలపాతాల వద్ద పవిత్ర స్నానాలు ఆచరించి, స్వామివారి దర్శనం కోసం క్యూ లైన్లలో వేచి ఉన్నారు. ఆలయ అర్చకులు సోమేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు, రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు ఘనంగా నిర్వహించారు. "ఓం నమః శివాయ" మంత్రోచ్ఛారణలతో కుంటాల పరిసర ప్రాంతాలన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పోలీసులు, స్వచ్ఛంద సంస్థలు గట్టి బందోబస్తు, తాగునీరు, క్యూ లైన్ల ఏర్పాట్లు చేశారు. సాయంత్రం వేళ ఆలయ ప్రాంగణంలో భక్తులు జాగరణ చేస్తూ భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## మంచిర్యాల మహాప్రస్థానంలో భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు

మంచిర్యాల, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం మంచిర్యాల మహాప్రస్థానంలో మహా రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గోదావరి నదికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆమె ప్రసాద వితరణ చేపట్టారు. నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, శాంతితో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. మహాశివుని అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలని సురేఖ కోరుకున్నారు. ఈ పవిత్ర పర్వదినం ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందం, ఆధ్యాత్మిక శాంతి, విజయాలను నింపాలని ప్రార్థించారు. పర్వదినం సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని చేపట్టిన సేవా కార్యక్రమాల్లో ఆమె స్వయంగా పాల్గొని ప్రసాదాన్ని పంపిణీ చేశారు.




## నేడు చైర్మన్ ఎన్నిక

- తొలి మహిళా చైర్మన్‌గా దొంత అంజలి
- వైస్ చైర్మన్‌గా బీసీ, మైనారిటీల్లో ఒకరికి ఇచ్చే అవకాశం
- క్యాంపునకు తరలివెళ్లిన కౌన్సిలర్లు
- క్యాంపుల నుంచి నేరుగా సమావేశాలకు రాక

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త



కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రావడంతో లక్షెట్టిపేట మున్సిపల్ చైర్మన్‌గా తొలి మహిళ దొంత అంజలి ఎన్నిక కానున్నారు. చైర్మన్ అభ్యర్థిగా అభ్యర్థిగా ఆమె పేరును ఇదివరకే ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ప్రకటించడంతో ఈనెల 16వ తేదీన ఆమెను చైర్మన్ గా కౌన్సిలర్లు ఎన్నుకోనున్నారు. ఇక మున్సిపల్ వైస్ చైర్మన్ ఎవరన్న దానిపై జోరుగా చర్చ సాగుతోంది. కౌన్సిలర్లను క్యాంపులకు తరలించిన హస్తం పార్టీ మిగతా మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ ఎవరన్న విషయాన్ని అక్కడే ఖరారు చేయనుంది. క్యాంపుల నుంచి 16వ తేదీన ఎన్నిక సమావేశాలకు నేరుగా హాజరు కానున్నారు.

### వైస్ చైర్మన్ ఎన్నికపై ఉత్కంఠ

మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా దొంత అంజలి పేరు ప్రకటించడంతో వైస్ చైర్మన్ పదవి కోసం పలువురు కౌన్సిలర్ అభ్యర్థులు పోటీ పడుతున్నారు. బీసీ, మైనార్టీ సామాజిక వర్గాలకు చెందిన కొందరు పార్టీ ముఖ్య నేత లను ప్రసన్నం చేసుకొని ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ తరఫున 12 వార్డు నుండి గెలిచిన మైనార్టీ కౌన్సిలర్ పర్వీన్ సుల్తానా ఆరిఫ్ కూడా వైస్ చైర్మన్ పదవి దక్కించుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. బీసీ కౌన్సిలర్ అభ్యర్థులు కూడా తమకే ఇవ్వాలని పట్టుబడుతున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఈసారి బీసీలకే మరోసారి ఇస్తారా? మైనారిటీ సామాజిక వర్గానికి ఇస్తారా? అన్నది తేలాల్సి ఉంది.

### నూతన చైర్మన్‌కు ఎన్నో సవాళ్లు, బాధ్యతలు

నూతనంగా చైర్మన్‌గా ఎన్నో సవాళ్లు, సమస్యలు, బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. మున్సిపల్ చైర్మన్ పట్టణ స్థానిక సంస్థకు ఎన్నికైన అత్యున్నత ప్రతినిధి. వీరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలకు అధ్యక్షత వహించడం, పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన (నీరు, రోడ్లు, డ్రైనేజీ), పారిశుధ్యం పన్నుల వసూలు వంటి కీలక విధులను పర్యవేక్షిస్తూ, ప్రభుత్వం, ప్రజల మధ్య వారధిగా పనిచేస్తారు. ఈసారి కౌన్సిల్ సభ్యులుగా కొత్తవారు ఎన్నిక అవ్వడంతో చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ సమస్యలు, సవాళ్లను, బాధ్యతలను ఎలా ఎదుర్కొంటారో చూడాల్సి ఉంది.




భక్తులకు పండ్లు పంపిణీ చేస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

## కిటకిటలాడిన శైవక్షేత్రాలు

(మొదటిపేజీ తరువాయి)

ఎస్హెచ్ఓ బాలాజీ వరప్రసాద్ అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా ఈ ప్రముఖ శైవక్షేత్రానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం ఆసిఫాబాద్ మండలంలోని శైవ క్షేత్రాల్లో తెల్లవారుజాము నుంచే భక్తులు దర్శనాలు చేసుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. మహాశివరాత్రి పర్వదినమును పురస్కరించుకొని ఆసిఫాబాద్ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆలయంలో శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం క్లబ్ సభ్యులు భక్తులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మర్యాల ఉదయ బాబు, శ్రీనివాస్, కోశాధికారి శ్రీధర్, స్థానికులు శ్రీనివాస్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## మందమర్రిలో భారీ అగ్నిప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

స్థానికులను సైతం కలచివేశాయి.

### మందమర్రిలో అగ్నిమాపక కేంద్రం ఎక్కడ?

మందమరి పట్టణంలో పండుగ పూట విషాద ఘటన నేపథ్యంలో పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మందమర్రి వంటి పెద్ద పట్టణంలో అగ్నిమాపక కేంద్రం లేకపోవడం వల్లే ఇలాంటి ప్రమాదాల్లో ఆస్తి నష్టం భారీగా జరుగుతోందని వారు అంటున్నారు. మందమర్రిలో ఫైర్ స్టేషన్ ఉన్నట్లయితే మంటలను త్వరగా అదుపులోకి తీసుకురాగలిగేవారు. ఆస్తి నష్టం ఎంతో మేరకు తగ్గించవచ్చేది అని ప్రజలు వాపోతున్నారు. అగ్ని ప్రమాదం జరిగిన తర్వాతే స్పందించడం కాకుండా, ముందస్తు చర్యలు తీసుకుని పట్టణంలో శాశ్వత అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ఇలాంటి ఘటనల్లో ప్రతి సారి ప్రజలే నష్టపోవాల్సి వస్తుందా? అనే ప్రశ్నలు ఇప్పుడు మందమర్రిలో వినిపిస్తున్నాయి.

## పారుపల్లి తీరాన భక్తి పారవశ్యం

### గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన వేలాదిమంది భక్తులు

కోటపల్లి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కోటపల్లి మండలంలోని పారుపల్లి చింత ప్రాంతం శివనామస్మరణతో మారుమోగింది. మండలంలోని వివిధ గ్రామాల నుండి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చి పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి రైతులు తమ ఎడ్లబండ్లను, ట్రాక్టర్లను, నదీ జలాలతో శుభ్రం చేసి, పసుపు కుంకుమలతో అలంకరించి కుటుంబ సమేతంగా తరలివచ్చారు. నిష్టతో నదీ స్నానం ఆచరించి, ఆ పరమశివుని తలుచుకుంటూ రోజంతా ఉపవాసం, రాత్రంతా జాగరణతో స్వామివారి సేవలో తరించడానికి సిద్ధమయ్యారు.

**భక్తులకు అన్నప్రసాద వితరణ..**

గోదావరినదికి పుణ్యస్నానాలకు విచ్చేసిన భక్తుల ఆకలి తీర్చేందుకు వాసవి శ్రీ కాలభైరవ అన్నప్రసాద సేవకులు చేసిన కృషి అభినందనీయం. వారి ఆధ్వర్యంలో భక్తులకు వేడివేడి ఉప్మాను మహాప్రసాదంగా పంపిణీ చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఈ ప్రసాదాన్ని స్వీకరించి సేవకుల భక్తిని కొనియాడారు.

**శ్రీ కాలభైరవ స్వామి దర్శనం..**

నదీ స్నానం అనంతరం భక్తులు పారుపల్లి గ్రామంలో వెలసిన కాలభైరవ స్వామి వారిని దర్శించుకోవడం ఇక్కడి విశేషం. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్న తర్వాతే భక్తులు తమ గ్రామాలకు తిరుగుముఖం పడతారు.





## శివనామస్మరణతో మారుమోగిన ఆలయాలు

**సారంగాపూర్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:**

మండలంలోని శివాలయాలు ఆదివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. మండలంలోని వివిధ గ్రామాల్లో గల శివ క్షేత్రాల్లో ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయ కమిటీలు క్యూ లైన్లు, తాగునీరు వంటి కనీస వసతులను ఏర్పాటు చేశాయి. ముఖ్యంగా మండలంలోని యాకర్ పల్లెలో వెలిసిన బసవేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా మండల ప్రముఖులు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ అట్ల మహిపాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ వీరయ్య, స్థానిక సర్పంచ్ వడ్లకొండ దివ్య, సారంగాపూర్ సర్పంచ్ కోనేరు భూమన్న, జాం సర్పంచ్ కరిపే రవళి విలాస్, ఎస్సై శ్రీకాంత్, పలువురు రాజకీయ నాయకులు స్వామివారిని దర్శించుకున్నారు. వీరంతా సాంప్రదాయబద్ధంగా కోడెలను తిప్పి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పూజారి ప్రముఖులకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు పలికారు. మండల వ్యాప్తంగా ఉన్న ఇతర శివాలయాల్లో కూడా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఆధ్యాత్మిక చింతనలో మునిగిపోయారు.

## మందలించారని మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య

**సారంగాపూర్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:**



క్షణికావేశం ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. తాత, నానమ్మ మందలించారనే మనస్తాపంతో ఓ యువకుడు గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషాద సంఘటన సారంగాపూర్ మండలం అడెల్లి తండాలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై శ్రీకాంత్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. అడెల్లి తండాకు చెందిన ఆడే రితేష్ (16) తన చెల్లెళ్లతో కలిసి తండ్రి కేశవ్ వద్ద ఉంటున్నాడు. ఈ నెల 14వ తేదీ సాయంత్రం రితేష్ ఇంటి వద్ద ఉన్న తన తాత కారును నడపడానికి తీయగా, రితేష్ తాత, నానమ్మ వద్దని అతడిని మందలించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన రితేష్, ఇంట్లో ఉన్న గడ్డిమందును సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని నిర్మల్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం ఆదివారం ఉదయం నిజామాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో రితేష్ ప్రాణాలు విడిచాడు. మృతుడి తండ్రి జాదవ్ కేశవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి, మృతదేహానికి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

## కలమడుగు గోదావరి నది తీరాన పిల్లల ఉచిత వైద్య శిబిరం

**జన్నారం, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

జన్నారం మండలం కలమడుగు గ్రామ సమీపాన ఉన్న గోదావరి నది తీరంలో భవాని పిల్లల హాస్పిటల్ ఆధ్వర్యంలో పిల్లల ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గ్రామానికి ఇరువైపుల నుండి గోదావరి నది స్నానానికి చాలామంది భక్తులు వస్తారు కనుక పిల్లలకు నదీ స్నానం చేయిస్తారు.చన్నీళ్ళు కాబట్టి పిల్లలకు ఏమైనా సమస్యలు వస్తే ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండడం కోసం జన్నారం మండల కేంద్రంలో ఉన్న భవానీ పిల్లల హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కశ్యప్ శ్రీవాత్సవ్ కోరిక మేరకు కలమడుగు గోదావరి నది బ్రిడ్జ్ కింద ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో జలుబు, జ్వరం, దగ్గు తదితరాల అన్ని మందులు సమకూర్చారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు రవీందర్, హరీష్ రెడ్డి, నాగేష్, శ్రీనివాస్, కాండ్రపు రవీందర్, గ్రామ సర్పంచ్ భర్త బొంతల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం

**మందమర్రి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం రోజున మందమర్రి పట్టణంలోని స్టేషన్ రోడ్‌లో గల శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి, శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం ప్రాంగణంలో శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రధాన అర్చకులు భీమోజు కుష కుమార్ చారి ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవానికి ముందు ఎదురుకోలు కార్యక్రమం భాగంగా పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కళ్యాణంలో అమ్మవారి తరపున చిట్లోజు వీరాచారి-విజయ స్వామి, స్వామి వారి తరపున నాంపల్లి రవీంద్ర చారి-ధనలక్ష్మి దంపతులు పాల్గొని సేవలందించారు. కార్యక్రమానంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి భజన కార్యక్రమాలు నిర్వహించగా, లింగోద్భవ కాలంలో మహా శివునికి రుద్రాభిషేకం ఘనంగా చేశారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఆకునూరి లక్ష్మీనారాయణ, రేవెల్లి రాజయ్య, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కస్తూరి నరసింహ చారి, మను మయ సంఘం కార్పెంటర్ సంఘం అధ్యక్షుడు గొల్లపల్లి బ్రహ్మచారి, స్వర్ణకార సంఘం అధ్యక్షుడు వేణు, సభ్యులు వి. బ్రహ్మాచారి, నాగరాజు, రాజు, సాయి తదితరులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కళ్యాణ మహోత్సవం జరిపిస్తున్న పండితులు

## గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు

**హాజీపూర్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గోదావరి నదిలో పుణ్య స్నానాల కోసం వచ్చిన భక్తులతో కిటకిటలాడాయి. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని ముల్కల్ల గోదావరి నదీ తీరంలో హాజీపూర్ మండలంలోని అన్ని గ్రామాల భక్తులు, ఇతర ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు.అనంతరం శివాలయంలో దర్శనం చేసుకుని శివునికి ప్రత్యేక పూజలు అలాగే రుద్రాభిషేకం చేశారు.భక్తులు ద్విచక్ర వాహనాలు, కార్లలో పెద్ద సంఖ్యలో రావడం జరిగింది. భక్తులకు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పండ్లు, త్రాగు నీరు, మజ్జిగ అందించారు. పుణ్య స్నానాలకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా హాజీపూర్ ఎస్ఐ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

## నేడే లక్షెట్టిపేట పురపాలక చైర్మన్ ఎంపిక

**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపిక ప్రక్రియ సోమవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్ తెలిపారు. ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్ల సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తొలుత ఎన్నిక ప్రక్రియ పూర్తి చేసి, అనంతరం నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు కౌన్సిలర్లతో ప్రమాణ స్వీకారం చేయిస్తామని వెల్లడించారు.



## వైభవంగా 'నమో శంకర' ఆడియో సిడి ఆవిష్కరణ

### రచయిత పోతన్నకు సన్మానం

**సారంగాపూర్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:**

మండలంలోని యాకర్పల్లి గ్రామంలో ప్రసిద్ధ బసవేశ్వర ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నమో శంకర భక్తి గీత ఆడియో సిడిని సారంగాపూర్ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ శనివారం ఆవిష్కరించారు. బోరిగామ గ్రామానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు కొండూరు పోతన్న ఈ గీతాన్ని రచించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ.. కొండూరు పోతన్న కలం నుంచి జాలువారిన ఈ పాట అత్యంత భక్తిరంజితంగా ఉందన్నారు. శివుని గుణగణాలను వర్ణిస్తూ భక్తులను ఆకట్టుకునేలా పదజాలాన్ని ఉపయోగించడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం లిరిక్ రైటర్ పోతన్న మాట్లాడుతూ.. తాను రచించిన సాహిత్యానికి సునో యాప్ ద్వారా చక్కని సంగీతాన్ని, గాత్రాన్ని జోడించి ఈ భక్తి పాటను రూపొందించినట్లు తెలిపారు. శివరాత్రి వేళ ఈ పాటను ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు కొండూరు పోతన్నను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బసవేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి, బోరిగాం గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు చిన్నోళ్ల రాజకుమార్ రెడ్డి, ఆర్ఎంపీ డాక్టర్ నారాయణ, అరవింద్ ప్రసాద్, ఆలయ పూజారి అభి, భక్తులు పాల్గొన్నారు.

## వేలాల గట్టు మల్లన్న జాతరలో విషాదం

**జైపూర్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**



మహా శివరాత్రి పర్వదినాన వేలాల గట్టు మల్లన్న జాతరలో విషాదం చోటుచేసుకుంది. జైపూర్ మండలంలో మూడు రోజుల పాటు జరిగే వేలాల జాతరకు వచ్చిన నస్పూర్‌కు చెందిన బింగి రాజేందర్ (45) అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో గట్టు మల్లన్న స్వామిని దర్శించుకు నేందుకు గుట్ట పైకి వెళ్లే క్రమంలో గుండె నొప్పితో కింద పడిపోయాడు. అందుబాటులో ఉన్న వైద్యులు చికిత్స అందించిన ఫలితం లేకపోయిందని అప్పటికే రాజేందర్ చనిపోయినట్లు వైద్యులు గుర్తించారు.

## శివనామ స్మరణతో మార్మోగిన మందమర్రి

**- మహాశివరాత్రి పర్వదినాన ఆలయాల్లో భక్తుల రద్దీ**

**- జాగరణ, అభిషేకాలతో భక్తి పరవశం**

**మందమర్రి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మందమర్రి పట్టణం భక్తిరసంతో నిండిపోయింది. పట్టణంలోని శివాలయాలు తెల్లవారుజాము నుంచే భక్తులతో కిక్కిరిసిపోయాయి. "ఓం నమఃశివాయ" నినాదాలతో పట్టణం మార్మోగింది. వేకువజామునే భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి ఆలయాలకు చేరుకుని స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరినీరు, బిల్వదళాలతో శివార్చన నిర్వహించగా ఆలయ ప్రాంగణం భక్తులతో నిండిపోయింది. చిన్నారుల నుండి వృద్ధుల వరకు అందరూ ఉపవాస దీక్షలు చేపట్టి శివనామ స్మరణలో తలమునకలయ్యారు. ఆలయాల్లో రాత్రి జాగరణ కార్యక్రమాలు, భజనలు, హరినామ సంకీర్తనలు నిర్వహించారు. భక్తులు శివతాండవ స్తోత్రం, లింగాష్టకం, రుద్రాభిషేకాలు నిర్వహిస్తూ పరమశివుని కృపాకటాక్షం కోరుకున్నారు. కొన్నిచోట్ల ప్రత్యేకంగా శివపార్వతుల కల్యాణోత్సవం కూడా నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయ కమిటీలు భక్తులకు తాగునీరు, ప్రసాదం వంటి ఏర్పాట్లు చేశారు. పోలీసు శాఖ ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టి భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంది. పర్వదినాన కుటుంబ సమేతంగా ఆలయాలకు తరలివచ్చిన భక్తులు శివుని అనుగ్రహంతో అందరికీ శాంతి, సుఖసంతోషాలు కలగాలి అంటూ ప్రార్థించారు. మహాశివరాత్రి సందర్భంగా మందమర్రి పట్టణం ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయి, శివనామ స్మరణతో మార్మోగింది.



ఆలయంలో అభిషేకంలో పాల్గొన్న భక్తులు




విద్యార్థిని ఆస్మాను అభినందిస్తున్న అధ్యాపక బృందం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిటీ అధ్యక్షుడు ఉత్తం నాయక్



నృత్యాలు చేస్తున్న చిన్నారులు

## రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపికైన జన్నారం విద్యార్థిని

**జన్నారం, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

జన్నారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సిఇసి ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఎండి ఆస్మా రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యారని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి. శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సిఎం కప్ క్రీడా పోటీల్లో భాగంగా జిల్లా స్థాయిలో జరిగిన కరాటే పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎండి ఆస్మాను రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఎండి ఆస్మాను ప్రిన్సిపల్ పి. శ్రీనివాస్, కళాశాల అధ్యాపకులు బాబూరావు, నాగేశ్వర్ రావు, మోహన్, దేవేందర్, కరుణాకర్, కుమారస్వామి, శశికళ, స్వరూప, శివరాంలు అభినందించారు.

## కోతులతో ప్రజలు బెంబేలు...

### - భయాందోళనలో కాలనీవాసులు

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:**



జిల్లా కేంద్రంలోని పైకాజినగర్‌తో పాటు పలు కాలనీలలో కోతుల బెడద రోజురోజుకు పెరుగుతూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. కాలనీల్లోకి గుంపులుగా ప్రవేశిస్తున్న కోతులు ఇళ్ల పైకప్పులు, బాల్కనీలు, వీధుల్లో స్వేచ్ఛగా సంచరిస్తూ ఇళ్లలోకి వెళ్తూ భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ఇటీవల కోతుల దాడుల వల్ల కొందరు స్థానికులు గాయపడటంతో ప్రజల్లో ఆందోళన మరింత పెరిగింది. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు రావాలంటేనే భయపడుతున్న పరిస్థితి నెలకొంది. ఆహారం కోసం ఇళ్లలోకి చొరబడటం, వస్తువులను పాడుచేయడం వంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. జిల్లా కేంద్రంలోనే ఈ పరిస్థితి ఉండటంతో ప్రజల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కోతుల బెడద నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## గ్రామ సమాఖ్య భవన నిర్మాణ పనులకు శ్రీకారం

**పెంచికల్‌పేట్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

పెంచికల్‌పేట్ గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పథకం ద్వారా 10. లక్షల 50 వేల రూపాయలతో మంజూరు అయినా గ్రామ సమాఖ్య భవనానికి ఆదివారం సర్పంచ్ ఉస్మాన్ కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్దే తమ లక్ష్యమని తెలిపారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మల్యాల శేఖర్, గ్రామ పాలకవర్గం సభ్యులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ ఉస్మాన్

# ఘనంగా సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు

### - సాంప్రదాయ పూజలతో జెండా ఆవిష్కరణ



సేవాలాల్ జెండా వద్ద సాంప్రదాయ పూజలు

**కెరమెరి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :**

లంబాడి సమాజ ఆధ్యాత్మిక మార్గదర్శి సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి సందర్భంగా కెరమెరి లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఉదయం నుంచే మండలంలోని వివిధ తండాలు, గ్రామాల నుంచి లంబాడి ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. సంప్రదాయ దుస్తుల్లో మహిళలు, యువతులు రంగురంగుల వేషధారణతో వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనార్‌పల్లి చౌరస్తా వద్ద నుంచి ప్రారంభమైన భారీ ర్యాలీ సేవాలాల్ విగ్రహం వరకు, అక్కడి నుంచి ప్రధాన రహదారి గుండా కొనసాగింది. డప్పులు, బాణసంచా నడుమ యువకులు, మహిళలు సాంప్రదాయ నృత్యాలతో ఉత్సాహాన్ని రెట్టింపు చేశారు. ర్యాలీ మార్గమంతా జై సేవాలాల్ నినాదాలతో మారుమోగింది. విగ్రహం వద్ద పెద్దలు, కమిటీ సభ్యులు సాంప్రదాయ పూజలు, భోగ్ బండార్ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యక్రమంలో జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షులు రాథోడ్ ఉత్తమ్ నాయక్ మాట్లాడుతూ, సేవాలాల్ మహారాజ్ బోధించిన సత్యం, సేవా భావం, సమానత్వం వంటి విలువలను యువత ఆచరించాలని పిలుపునిచ్చారు. సమాజ అభివృద్ధికి విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఇతర పెద్దలు మాట్లాడుతూ లంబాడి సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని కోరారు. ప్రభుత్వం సమాజ అభ్యున్నతికి మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశం అనంతరం అన్నదానం నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మొత్తం కార్యక్రమం ఉత్సాహభరితంగా, శాంతియుత వాతావరణంలో సాగింది. ఈ కార్యక్రమం లో సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ పెద్దలు రాథోడ్ శంకర్ నాయక్, రూప్ లాల్ నాయక్, శేషారావ్ రాథోడ్, అంబాజీ నాయక్, బానోత్ వెంకటి నాయక్, సకారం మహారాజ్, వివిధ గ్రామాల శారద ఉమేష్ నాయక్, అమూల్, బల్వంత్, నాయకులు రాథోడ్ రవినాయక్, బానోత్ మహేందర్, రాథోడ్ సుభాష్, నిరంజన్ దాస్, జాటో త్ తిరుపతి, రవి, తదితరులు పాల్గొన్నారు.

**జన్నారం, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

జన్నారం మండలంలోని బంగారు తండా గ్రామంలో బంజారా ఆరాధ్య దైవమైన సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జయంతి సందర్భంగా గ్రామస్తులు సేవాలాల్ మహారాజ్‌కు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భుక్యా నిర్మల రవీందర్, ఉప సర్పంచ్ జగదీష్ నాయక్, కారోబార్ అజ్మీరా గోవింద్ నాయక్, ఆలయ కమిటీ ఛైర్మన్ బోడరాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.

**సిరికొండ, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:**

బంజారాల ఆరాధ్య దైవం, గొప్ప సామాజిక సంస్కర్త సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు సిరికొండ మండల వ్యాప్తంగా ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. మండలంలోని వివిధ తండాల్లోని సేవాలాల్ మందిరాల్లో భక్తులు తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా బంజారా యువతీ యువకులు, మహిళలు తమ సాంప్రదాయ దుస్తులు ధరించి, ఎరుపు, తెలుపు జెండాలతో తండాల్లో భారీ ఊరేగింపు నిర్వహించారు. సేవాలాల్ మహారాజ్ భోజన ప్రియుడైనందున.. మందిరాల వద్ద బియ్యం, బెల్లం, నెయ్యితో తయారు చేసిన లప్సిని నైవేద్యంగా సమర్పించి భోగి బండారు కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ.. సేవాలాల్ మహారాజ్ బోధించిన శాంతి, సమానత్వం, పర్యావరణ పరిరక్షణ నేటి తరానికి ఎంతో ఆదర్శమని కొనియాడారు. భక్తిశ్రద్ధలతో సాగిన ఈ వేడుకల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సేవాలాల్ మహారాజ్‌కు పూజలు నిర్వహిస్తున్న బంజారాలు



## అంగరంగ వైభవంగా శివపార్వతుల కళ్యాణం

### ఊరేగింపులో పోటెత్తిన భక్తజనం

**సిరికొండ, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:**



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని సిరికొండ మండల కేంద్రంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. మండల కేంద్రంలోని శివాలయంలో శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని అర్చకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. భక్తుల జయజయధ్వానాలు, మంగళవాయిద్యాల మధ్య సాగిన ఈ ఊరేగింపు నయనానందకరంగా సాగింది. మండలంలోని కొండాపూర్ శివాలయంతో పాటు ఇతర క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి దర్శనం కోసం క్యూ లైన్లలో బారులు తీరారు. హర హర మహాదేవ.. శంభో శంకరఖి నామస్మరణలతో ఆలయ ప్రాంగణాలు మారుమోగాయి. భక్తులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. మహాశివరాత్రి పురస్కరించుకొని భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టి, రాత్రంతా ఆలయాల్లో జాగరణ చేస్తూ భజనలు, కీర్తనలతో శివయ్యను కొలిచారు.

# హర హర మహాదేవ శంభో శంకర



స్వామివారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప రమాదేవి దంపతులు

*** ఈస్గాం శివమల్లన్న ఆలయంలో పోటెత్తిన భక్తులు**

*** శివనామస్మరణతో మార్మోగిన శివాలయం**

*** ఘనంగా మహాశివరాత్రి వేడుకలు**

కాగజ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కాగజ్‌నగర్ మండలం ఈస్గాం శివమల్లన్న స్వామి దేవాలయం కిటకిటలాడింది. ఉదయం నుండే భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప రమాదేవి దంపతులు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని అభిషేకం ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, ఆలయ కమిటి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప రమాదేవవి దంపతులకు స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు పక్కనే ఉన్న మహారాష్ట్ర నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల కోసం పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు, ప్రతినిధులు ఆల్పాహారం, ప్రసాద వితరణ పంపిణి కార్యక్రమాలను చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణి చేశారు. భక్తుల సౌకర్యార్థం ఈస్గాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సాయంత్రం శివపార్వతుల కళ్యాణోత్సవం, అనంతరం రథోత్సవం కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ వేణుగోపాల్ గుప్తా తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. జాతరలో ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకుండా కాగజ్‌నగర్ డీఎస్పీ వహిదుద్దీన్ ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ రూరల్ సీఐ కుమారస్వామి, ఈస్గాం ఎస్సై కళ్యాణ్ పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.



క్యూలైన్‌లో నిల్చున్న భక్తులు



## శ్రీ శ్రీ శ్రీ సద్గురు సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో నడవాలి

(మొదటిపేజీ తరువాయి)

గొప్ప అధ్యాత్మిక గురువు సేవాలాల్ అన్ని అన్నారు. సృష్టి లో ప్రతి జీవి పైన ప్రేమ, దయ, కరుణ చూపించాలని కోరారు. 20 కోట్ల బంజారా ప్రజల గుండెలో నిలిచినా దేవుడు సేవాలాల్. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ సర్పంచ్ అనిత శ్రీనివాస్ జాదవ్, జేఏసీ నాయకులు జగన్ నాయక్, నేతావత్ రాందాస్ నాయక్, గంగారాం నాయక్, కారోబారి వీరేందర్, సుధాకర్ నాయక్, మహేందర్, వసంత్ రావు, రవీందర్, సచిన్, చంద్రకాంత్, గడం ప్రకాష్, జాదవ్ గోపాల్ రావు, రోహిదాస్, బాలు మహారాజ్, శ్రీకాంత్, బంకట్ లాల్ కవి, వినోద్, గణేష్, రాంరావ్, రవి నాయక్, జయచంద్ర, సురేష్ డాక్టర్, రాం కిషన్, లక్కారం సర్పంచ్ అజ్మీరా రేణుక తో పాటు ప్రతి తండా నుండి పాల్గొన్న సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబెర్స్, మహిళాలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన గోదావరి నది తీరాలు

**శివనామ స్మరణతో పరవశించిన భక్తులు - పుణ్య స్నానాలు ఆచరించి శివునికి అభిషేకం చేసిన భక్తులు**

జన్నారం, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త

హిందువులకు దేశంలోనే అత్యంత ప్రీతికరమైన పర్వదినాల్లో ఒకటైన మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గోదావరి నది తీరాలు పుణ్య స్నానాల కోసం వచ్చిన భక్తులతో కిటకిటలాడాయి. జన్నారం మండలం లోని బాదంపల్లి, ధర్మారం, కలమడుగు, చింతగూడెం, రోటీగూడెం, తపాలపూర్, రాంపూర్ గ్రామాలలోని గోదావరి నదీ తీరంలో మండలంలోని అన్ని గ్రామాల భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం శివాలయంలో దర్శనం చేసుకుని శివునికి ప్రత్యేక పూజలు అలాగే రుద్రాభిషేకం చేశారు. మండలం లోని బాదంపల్లి, చింతగూడెం, కలమడుగు గోదావరి తీరానికి వెళ్ళడానికి దాదాపు కిలోమీటరు వరకు దారి పొడవునా భక్తులు ఎడ్ల బండ్లు ద్విచక్ర వాహనాలపై కార్లలో పెద్ద సంఖ్యలో రావడంతో పెద్ద జాతరలా కనువిందు చేసింది. పుణ్య స్నానానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా గ్రామాల సర్పంచులు చర్యలు తీసుకున్నారు. గోదావరి నదీ తీరంలో ఉన్న పుష్కర ఘాట్లను సరి చేయించి మంచి వసతులు కల్పించారు. అలాగే భక్తులకు భవాని యూత్ ఆధ్వర్యంలో పండ్లు, త్రాగు నీరు అందించారు. పర్వదినం సందర్భంగా గోదావరి నది తీరాలు , దేవాలయాలు అంతా శివోహం శివోహం శివోహం అనే శివనామస్మరణతో మారు మ్రోగిపోయింది. శివ జపంతో భక్తులు పరవశించిపోయారు.



జన్నారం మండలం బాదంపల్లి గోదావరి నదీ తీరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



భవాని యూత్ ఆధ్వర్యంలో భక్తులకు పండ్లు అందచేస్తున్న దృశ్యం

## పంచకళపురి భద్రకాళి ఆలయంలో శివరాత్రి శోభ

**- కల్పవల్లి భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దర్శనంలో భక్తులు**



పెంచికల్‌పేట్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :

పెంచికల్‌పేట్ మండలంలోని పంచకళపురి క్షేత్రంలో వెలసిన 450 సంవత్సరాల చరిత్ర కలిగిన పురాతన దేవాలయం శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు కొనసాగే జాతరలో భాగంగా తొలి రోజు నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ప్రాణహిత ఉపనది అయిన జయమంగళ నది ( పెద్దవాగు ) ఉత్తర తీరాన విరాజిల్లుతున్న ఈ క్షేత్రం ఆధ్యాత్మిక చైత్యనానికి నిలయంగా ప్రసిద్ధి చెందింది. ప్రకృతి సోయగాల నడుమ వెలసిన ఈ దేవస్థానం తీర్థక్షేత్రంగా ఖ్యాతి గాంచింది. ఇక్కడ అమ్మవారు భక్తుల కోరికలను తీర్చే కల్పవల్లిగా విశ్వాసం పొందారు. వీరభద్ర స్వామి సైతం, అభీష్టాలను నెరవేర్చే దైవంగా ప్రజలలో ప్రగాఢ భక్తి ఉంది. మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం ఉదయం సుప్రభాత సేవ, గణపతిపూజ, దీక్షధారణ, అఖండ దీప స్థాపన ధ్వాజారోహణము, స్వామి, అమ్మవార్ల అభిషేకం, నిరంజన స్వామి సమాధిపూజ, మహా నైవేద్యం, మహా మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు రాత్రి రుద్రాభిషేకం, లింగోద్భావ దర్శనం మంత్ర పుష్ప సమర్పణం నిర్వహించనున్నట్లుగా ఆలయ పీఠాధిపతి మూలమఠం శివప్రసాద్ తెలిపారు. సోమవారం రెండో రోజు భద్రకాళి సమేత వీరభద్ర స్వామి వారికి అభిషేకం, అన్నబలి, మహానైవేద్యం, హారతి, భక్తులచెత అన్నదాన వితరణ, అమ్మవారి కళ్యాణం, అగ్నిగుండ ప్రతిష్ట, వీరభద్ర స్వామి ఖడ్గములచే ప్రభల ఊరేగింపు, మూడో రోజు మంగళవారం అగ్నిగుండ ప్రవేశంతో జాతర ముగియనున్నట్లుగా తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో త్రాగునీరు, అన్నదానం, జాగ్రత్తలు చేపట్టామన్నారు.